సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



కొనసాగుతున్న సమ్మె
సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. ధర్మ టీచర్స్ యూనియన్ మద్దతు తెలిపింది.
- 8లో ▸



ఎంపీడీవో కార్యాలయానికి..
అద్దె చెల్లించలేదనే కారణంతో మోపాల్ ఎంపీడీవో కార్యాలయానికి బిల్డింగ్ ఓనర్ తాళం వేశారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.3 /7.5

వాతావరణం
ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

విచారణకు బదులు సెటిల్‌మెంట్

- నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చిన ప్లానర్‌కు అనుకూలంగా ఓనర్‌నే బ్లాక్‌మెయిల్ చేసిన టీపీవో అధికారి
- కలెక్టర్ విచారణకు ఆదేశించగా తప్పుదోవ పట్టించిన వైనం
- నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇదీ పరిస్థితి
- రోడ్డు వెడల్పు నిబంధనలు తుంగలో తొక్కి భారీ భవనానికి అనుమతులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలు చేయాల్సిన అధికారులే వాటిని ఉల్లంఘించడమెలాగో మార్గాలు సూచిస్తున్నారు. మరోవైపు నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ మీద జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా, విచారణకు బదులు బాధితుడిని బెదిరించి సెటిల్‌మెంట్ దందా చేయడం విశేషం. ఇదీ నిజామాబాద్ నగరపాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ అధికారుల కథాకమామీషు. ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చే విషయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రభుత్వ నిబంధనలు కాదని వ్యవహరించడం గమనార్హం. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసేందుకు ఓ వ్యక్తి, నగరానికి చెందిన ఒక లైసెన్స్‌డ్ ఇంజినీర్‌ను సంప్రదించాడు. అయితే సదరు లైసెన్స్‌డ్ ఇంజినీర్ నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించాడు. ఇందులోనూ కొందరు టౌన్ ప్లానింగ్ ఉద్యోగులదే కీలకపాత్ర అని పలువురు చెబుతున్నారు. అయితే ఇది నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ అని ప్లాట్ ఓనర్‌కు మాత్రం తెలియదు. దీనిపై అతనికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు పంపారు. దీంతో సదరు వ్యక్తి లైసెన్స్‌డ్ ఇంజినీర్ వద్దకు వెళ్లి నోటీసులు చూపించాడు. ఈ నోటీసుకు సంబంధించి ప్లాట్ ఓనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన సదరు ఇంజినీరు టౌన్‌ప్లానింగ్ విభాగానికి రిప్లై పంపాడు. ఈ క్రమంలో అవసరమైన మేర ఫీజు కట్టాల్సిందేనని టౌన్ ప్లానింగ్ నుంచి మరో నోటీసు సదరు ప్లాట్ ఓనర్‌కు పంపారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన సదరు ప్లాట్ ఓనర్ నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించిన లైసెన్స్‌డ్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.

పోలీసులకు మున్సిపల్ అధికారులు సైతం ఫిర్యాదు చేశారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్లాట్ ఓనర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించగా, విచారణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారి చేయలేదు. పైగా నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ఇంజినీరును కాపాడేందుకు గాను టౌన్‌ప్లానింగ్ అధికారి ప్లాట్ ఓనర్‌ను బెదిరించి ఫీజు కట్టించడం విశేషం. ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేయడం గమనార్హం. నకిలీ వ్యవహారాన్ని నడిపిన లైసెన్స్‌డ్ ఇంజినీరును బ్లాక్ లిస్ట్‌లో పెట్టి పోలీసులతో క్రిమినల్ కేసులు పెట్టించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులే జాగ్రత్తగా కాపాడుతూ.. బాధితుడిని బ్లాక్‌మెయిల్ చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంలో కలెక్టర్‌ను సైతం టౌన్‌ప్లానింగ్ అధికారులు మోసం చేయడం గమనార్హం.

■ శ్రద్ధానంద్‌గంజ్ ఏరియాలో ప్రభాత్ టాకీస్ వద్ద సతీష్ పవార్ ఇంటి వెనుక భాగంలో నిబంధనల ప్రకారం రోడ్డు నుంచి 30 అడుగుల స్థలం వదలాల్సి ఉండగా, 25 అడుగులు మాత్రమే వదిలి భారీ భవనం నిర్మించారు. ఈ భవనానికి ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ శ్యాం, టీపీఎస్ అనుపమ అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ విషయంలో మున్సిపల్ అధికారులే జీవో 168ని ఉల్లంఘించారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదు. పై అంశాల్లో కీలక ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా తగిన చర్యలు తీసుకునేలా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

■ నగరంలోని గాయత్రినగర్ ఏరియాలో 773, 774, 775, 787, 790, 791 సర్వే నంబర్లలో ఓ వ్యక్తి వెంచర్ వేసి చాలావరకు ప్లాట్లను అమ్మేశాడు. కాగా ఇందులో ఒక ప్లాట్‌లో నిర్మాణానికి సంబంధించి సదరు వెంచర్ వేసిన వ్యక్తి పేరిట బిల్డర్ టీఎస్‌బీపాస్ ద్వారా దరఖాస్తు చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా చేసిన ప్రవీణ్ సైట్ ఇన్స్‌పెక్షన్ సైతం చేశాడు. డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ వికాస్ అప్రూవల్‌తో అనుమతులు ఇచ్చారు. విచిత్రమేమిటంటే అదే దరఖాస్తుపై మరొక వ్యక్తి పేరుమీద అనుమతులు ఇచ్చారు. సదరు అనుమతులు పొందిన వ్యక్తి మరొక ప్రభుత్వ ఉద్యోగికి నిర్మించిన ఇల్లును అమ్మేసి బ్యాంకు లోన్ ఇప్పించడం విశేషం. దీనిపైనా విచారణ చేయకుండా సదరు ఫైల్‌ను తొక్కిపెట్టడం గమనార్హం. ఈ విషయాలపై వివరణ కోసం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా తక్షణమే ఈ ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

న్యూస్‌రీల్

గోదాము మంజూరు చేయించండి



జక్రాన్‌పల్లి: పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను జేఎంకేపీఎం మనోహరాబాద్ పసుపు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు సోమవారం ఢిల్లీలో కలిశారు. ఎంఎస్‌ఎంఈ నుంచి యూనిట్ మంజూరుకాగా, మనోహరాబాద్‌లో పసుపు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశామని డైరెక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. పసుపు ఉత్పత్తిదారుల సంఘం ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వచ్చామన్నారు. కేపీఏం రైతు సంఘానికి 20 వేల స్క్వేర్ ఫీట్ల గోదాము సబ్సిడీపై మంజూరయ్యేలా సహకరించాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో డైరెక్టర్లు పుప్పాల నాగేశ్, గడ్డం రాజు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ పతిరెడ్డి ఉన్నారు.

ఘనంగా శబరిమాత ఉత్సవాలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో సోమవారం రెండోరోజు శబరిమాత పాదుక పూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం సుప్రభాతం,ధ్యానం, భగవద్గీత, గురుచరిత్ర పారాయణం చేశారు. అనంతరం అందంగా అలంకరించిన హంస వాహనంలో శబరిమాత పాదుకలు, చిత్రపటాన్ని ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులమీదుగా శోభాయాత్ర సాగింది. భక్తులు, కళాకారుల నృత్యాలు అలరించాయి. అనంతరం ఆశ్రమ సమీపంలోని ఊరగుట్టపై శబ రి మాత పాదుకలను ఉంచి, పాదుకా పూజోత్సవం నిర్వహించారు. జిల్లావాసులే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, హైదరాబాద్ తదితర జిల్లాలు, పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలనుంచి భక్తులు భారీగా తరలివచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్దకు ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన యువకుడిని పోలీసులు కాపాడారు. హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతానికి చెందిన అనపోజు వినయ్ (28) కుటుంబ సభ్యులతో గొడవపడి సోమవారం పోచారం ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. ప్రాజెక్టు కట్టపై నిలబడి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి తానున్న లొకేషన్‌ను ఫోన్ ద్వారా పంపాడు.వినయ్ కుటుంబ సభ్యులు అప్రమత్తమై 100 డయల్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. సమాచారం అందుకున్న నాగిరెడ్డిపేట పోలీసులు వెంటనే ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు కట్టపై నిలబడి ఉన్న వినయ్‌ను అదుపులోకి తీసుకుని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన కానిస్టేబుల్ చంద్రయ్య, హోంగార్డు కాశయ్యను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేయండి

ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్ మాట్లాడుతూ..

జిల్లా విద్యాశాఖలో వివిధ కేటగిరీల్లో డిప్యుటేషన్‌లలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను వారి సొంత స్థానాల్లోకి తిరిగి పంపించాలన్నారు. ఇటీవల పదోన్నతులు, బదిలీలు, కొత్త ఉపాధ్యాయుల నియామకాలతో ఖాళీలు భర్తీ అయినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్ తదితరులున్నారు.

అట్టహాసంగా సీఎం కప్ జిల్లాస్థాయి టోర్నీ



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణులు

- పాత కలెక్టరేట్ క్రీడా మైదానంలో ప్రారంభమైన పోటీలు
- హాజరైన రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్‌నాగారం: గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులు, యువతలో వివిధ క్రీడల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ప్రోత్సహించడానికి సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తెలిపారు. సోమవారం పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నమెంట్

జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన తాహెర్‌బిన్ హందాన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 వరకు జరిగే వాలీబాల్, బాస్కెట్‌బాల్, కరాటే తదితర క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ప్రభుత్వం క్రీడారంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బాడ్సీ శేఖర్‌గౌడ్, వ్యాయామ సంఘం ప్రతినిధులు విద్యాసాగర్‌రెడ్డి, గోపిరెడ్డి, మల్లేష్‌గౌడ్, శంషోద్దీన్, రాజాగౌడ్, సురేందర్, ఉమేర్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ సంఘానికి చోటు లేదు

సీఎం కప్ ఆటల పోటీలలో ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులను ప్రొటో కాల్ లో మర్చిపోయారు. ఈ విషయంలో కలెక్టర్‌ను సంప్రదిస్తామని ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. అంతే గాకుండా నూడా చైర్మన్ కేశ వేణు పేరు కూడా ఇన్విటేషన్ కార్డులో లేకపోవడంతో విమర్శలు వస్తున్నాయి.

హాజరు 50 శాతమే !

- గ్రూప్–2 పరీక్షలపై అభ్యర్థుల నిర్లిప్తత
- విస్మయం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు

నిజామాబాద్‌అర్బన్: రెండ్రోజుల పాటు జరిగిన గ్రూప్–2 పరీక్షలకు అభ్యర్థులు భారీగా గైర్హాజరయ్యారు. మొత్తం నాలుగు పేపర్లకు పరీక్ష నిర్వహించగా ప్రతి పరీక్షకు సుమారు సగం హాజరే నమోదైంది. ఈనెల 15,16 తేదీల్లో గ్రూప్–2 పరీక్షలు జరిగాయి. అధికారులు 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం చివరి రోజు ఉదయం జరిగిన పరీక్షకు 19855 మంది అభ్యర్థులకు గాను 8915 మంది హాజరయ్యారు. 10940 మంది గైరాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షను 8911 మంది రాశారు. 10944 మంది గైరాజరయ్యారు. నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడిలో గల గౌతమి డిగ్రీ కళాశాలలో తనిఖీల్లో భాగంగా అధికారు అభ్యర్థుల బెల్టులను తీసివేయించారు. మొదటి రోజు అభ్యర్థులు బెల్టులు ధరించి పరీక్ష హాజరయ్యారు. అభ్యర్థులు ప్రశ్నించగా రూల్స్ మారాయని అక్కడి సిబ్బంది పేర్కొన్నారు. ఓ అభ్యర్థితో దురుసుగా ప్రవర్తించడంతో వాగ్వావాదం జరిగింది. మొదటి రోజు నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. అధికారుల ముందస్తు జాగ్రత్తలతో జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



గ్రూప్–2 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు (ఫైల్)

■ పోటీ పరీక్షల కోసం గత కొన్ని సంవత్సరాలుగా అభ్యర్థులు ఎదురు చూశారు. పోటీ పరీక్షలు నిర్వహిస్తే ఉద్యోగం సంపాదిస్తామని ధీమాతో వ్యక్తం చేశారు. తీరా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్స్ పరీక్షలకు మాత్రం అభ్యర్థుల నుంచి నామమాత్రపు స్పందన రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గ్రూప్స్ పరీక్షల నిర్వహణ చాలా కాలం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకధాటిగా నిర్వహించింది. అయితే పరీక్షలకు హాజరు కావడంలో అభ్యర్థులు మాత్రం ఆసక్తి కనబరచడం లేదు. గ్రూప్స్ పరీక్షలకు వరుసగా గైర్హాజర్ పెరిగింది. దీనిపై విద్యావేత్తలు నిరుద్యోగులు కూడా ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలకు మొదటి రోజు 48 శాతం, రెండవ రోజు 47 శాతం మాత్రమే అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. సగానికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. ప్రస్తుతం కూడా గ్రూప్–2 పరీక్షలకు సగానికి పై అభ్యర్థులు గైర్హాజరఅయ్యారు.

గ్రూప్–2 పరీక్షకు అభ్యర్థుల హాజరు ఇలా..

పరీక్ష	దరఖాస్తులు	హాజరు	గైర్హాజరు
పేపర్-1	19,855	9070	10,785
పేపర్-2	19,855	9020	10,835
పేపర్-3	19,855	8915	10,940
పేపర్-4	19,855	8911	10,944

పోలీసు బందోబస్తు




ఖలీల్ వాడి: గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిచారు. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూ శర్మ ఆదేశాల మేరకు అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి వివిధ పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలుసూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. అదనపు పోలీస్ కమిషనర్ (ఏఆర్) శంకర్ నాయక్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, బందోబస్తు పర్యవేక్షలో పాల్గొన్నారు.

❝ రెగ్యులర్‌గా నోటిఫికేషన్‌లు ఇవ్వాలి



ప్రభుత్వం పోటీ పరీక్షలకు రెగ్యులర్‌గా నోటిఫికేషన్‌లు ఇస్తే మరింత మంది ఆసక్తి చూపే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం అమలు చేస్తే అభ్యర్థులు ఉత్సాహంగా హాజరయ్యే అవకాశం ఉంటుంది. – గంట చంద్రశేఖర్, ప్రొఫెసర్, మాస్‌కమ్యూనికేషన్, తెయూ



ధరణి చింత తీరేదెన్నడో..

- అధికారుల తప్పులు : రైతులకు తిప్పలు

ఇందల్వాయి: ప్రభుత్వం మారి ఏడాది గడుస్తున్నా ధరణి వెబ్‌సైట్ తీరు మాత్రం మారలేదు. గతంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు రైతులు అనేక తిప్పలు పడుతున్నారు. ధరణి వెబ్‌సైట్‌లో తప్పుడు వివరాల నమోదు కారణంగా కొత్తగా రిజిస్ట్రేషన్‌లు చేసుకునే రైతులు, వారసత్వ మార్పిడి చేసుకునే రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి, సమయంతో పాటు డబ్బు వృథా అవుతోంది.

సమస్యలు ఇలా..

సర్వే నంబర్లలో విస్తీర్ణాన్ని హెచ్చు తగ్గులుగా నమోదు చేయడం, నమోదు చేసిన సర్వే నంబర్లకు డిజిటల్ సంతకాలు చేయకపోవడం వంటి ప్రధాన తప్పిదాల వల్ల రిజిస్ట్రేషన్‌లకు, పట్టాదారుల మరణానంతరం వారసత్వ మార్పిడిలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వే నంబర్లలో లోపాలు తెలియక స్లాట్ బుక్ చేసుకున్న రైతుల దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. అధికారులచే క్షుణ్ణంగా పరిశీలించిన దరఖాస్తులు కూడా చిన్న చిన్న తప్పిదాల మూలంగా తిరస్కరణకు గురవుతున్నాయి. ముందస్తుగా చెల్లించిన డబ్బులు కూడా ప్రభుత్వం తిరిగి చెల్లించడం లేదు.

❝ తొమ్మిది నెలలుగా తిరుగుతున్నా..



మా నాన్న చనిపోయి ఏడాది అవుతోంది. అతని పేరు మీద ఉన్న ఏడు ఎకరాల భూమిని నా పేరు మీద మార్చుకునేందుకు తొమ్మిది నెలలుగా తిరుగుతున్నా పని కావడం లేదు. ఒక సర్వే నంబరులో విస్తీర్ణం ఎక్కువగా ఉందని, మరొక సర్వే నంబరుకి డిజిటల్ సంతకం కాలేదని తిరస్కరించారు. చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 18 వేలు తిరిగి రాలేదు. అధికారులను సంప్రదించి తప్పులు సరి చేయించి పూర్తి వివరాలతో మరోసారి రూ. 18 వేలు చెల్లించి స్లాట్ బుక్ చేసుకొని ఆరు నెలలు అవుతోంది. తహసీల్దార్,ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలఎ ఎన్ని మార్లు తిరిగినా పని కావట్లేదు. అధికారులు చేసిన తప్పులకు మేము శిక్ష అనుభవించాల్సి వస్తోంది. – గడ్డం గంగవ్వ, చంద్రాయన్‌పల్లి

అన్ని సరిచేసి స్లాట్ బుక్ చేసినా పని కావట్లేదు



నా పేరు సంతోష్ రెడ్డి. దుబాయ్‌లో ఉంటాను. మా నాన్న చనిపోతే అతని పేరు మీద ఉన్న మూడెకరాల భూమిని నా పేరు మీదికి మార్చుకునేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించి రూ. 8 వేలు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటే పావు గుంట విస్తీర్ణం పెరిగిందని అంటున్నారు. ఆ విస్తీర్ణం పెరగడానికి కారణం మేము కాదు కదా. అలాంటప్పుడు అధికారులు చేసిన తప్పులకు మమ్మల్ని ఎందుకు బాధ్యులను చేస్తారు. తొందరగా పని అవుతుందని దుబాయ్ నుండి వస్తే ఇలా జరిగింది. విలువైన సమయం, ప్రయాణ ఖర్చులు అన్ని వృథా అయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి మా సమస్యలను తీర్చాలి. – డీ.సంతోష్ రెడ్డి, నల్లవెల్లి

ధరణి లోపాలను వేగంగా సవరించాలి

ధరణి వెబ్‌సైట్‌లో లోపాల మూలంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతలు నూతన కంపెనీకి మారిన నేపథ్యంలో లోపాలను వేగంగా సవరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. వెబ్‌సైట్ తప్పిదాల మూలంగా స్లాట్‌లు రద్దయినా తర్వాత కూడా కోట్ల రూపాయల రైతుల డబ్బు ఇంకా ప్రభుత్వం వద్దనే ఉంది. వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. – కుంట మోహన్ రెడ్డి, గన్నారం

విద్యాశాఖ కార్యాలయాలకు తాళాలు

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- మండల విద్యా వనరుల కేంద్రాలను తెరిచే వారు కరువు
- డిమాండ్ల సాధన కోసం పదకొండు రోజులుగా ఉద్యోగుల ఆందోళన



మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రాల్లోని విద్యాశాఖ కార్యాలయాల తాళాలు తెరిచేవారు కరువయ్యారు. పదకొండు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. విద్యా వనరుల కేంద్రాల ను శుభ్రం చేసేందుకైనా తెరవడం లేదు. తమ డి మాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఎంఐఎస్, సీఆర్‌పీ, మెస్సెంజర్‌లు, ఐఈఆర్‌పీలు, పీటీఐ, సీజీవీలు, కస్తూర్బా పాఠశాలల్లోని బోధన సిబ్బంది మొత్తం 896 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. తమకు పే స్కేల్ వర్తింప చేయాలని లేదా ఉద్యోగ భద్రత, రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు సమ్మె చేయగా వారికి అప్పుడు ప్రతిపక్ష పార్టీ కీలక నేతగా ఉన్న ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి సంఘీభావం పలికారు. ప్రభుత్వం తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా తమ డిమాండ్లను పరిష్కరించకపోవడంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళనకు దిగారు.

మొదట్లో రెండు రోజులు శాంతియుత నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. మండల విద్యా వనరుల కార్యాలయాల్లో ఒక్క ఎంఈవో మాత్రమే రెగ్యులర్ ఉద్యోగి, మిగిలిన ఉద్యోగులు అంతా సమగ్ర శిక్ష ఉద్యోగులే కావడం గమనార్హం. సమగ్ర శిక్ష ఉద్యోగులు మొత్తం సమ్మెలో పాల్గొంటుండటంతో మండల విద్యావనరుల కేంద్రాలకు తాళాలు తీసి శుభ్రం చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న రిటైర్డ్‌ ఉద్యోగుల క్రీడలు



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడాపోటీలు సోమవారం ఖలీల్‌వాడిలోని రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘ భవనంలో కొనసాగుతున్నాయి. సోమవారం క్యారం, చెస్‌, స్కిల్‌ గేమ్స్‌, ఫాస్ట్‌వాకింగ్‌, టెన్నీస్‌ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం నిర్వహించనున్న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్‌, ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్‌, కోశాధికారి ఆశయ్య తెలిపారు.

సాఫ్ట్‌బాల్‌ జిల్లా సీనియర్‌ ప్రాబబుల్స్‌ జట్ల ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం సీనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పురుషులు, మహిళల ప్రాబబుల్స్‌ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌ తెలిపారు. ఈ ఎంపికై న జట్టుకు జనవరి మొదటి వారంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, జిల్లా బేస్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌, జిల్లా సాఫ్ట్‌ బాల్‌ కోచ్‌లు నరేశ్‌, అనికేత్‌, సంజీవ్‌, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో డాక్టరేట్‌


గంగాధర్‌

నిజామాబాద్‌ రూరల్‌: వేల్పూర్‌ మండలం వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్‌ తెలుగు సాహిత్యంలో సమర్పించిన పరిశోధనకు సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ పట్టా ప్రకటించింది. గంగాధర్‌ సారంగపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు (ఎస్‌ఏ) ఉపాధ్యాయుడిగా పనిచేస్తునే 'తెలంగాణ స్మృతి కవిత్వం సమగ్ర పరిశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రసిద్ధ కవి, పరిశోధకుడు డాక్టర్‌ నాళేశ్వరం శంకరం పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గంగాధర్‌ను ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు సాగి కమలాకర శర్మ, ఉస్మానియా ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపల్‌ చింతకింది కాసిం, డాక్టర్‌ రఘు, ఆచార్య వారిజారాణి, సల్ల సత్యనారాయణ, గోపాల్‌, ఘనపురం దేవేందర్‌, భాగ్యలక్ష్మి అభినందించారు.

బైండోవర్‌ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

మాచారెడ్డి: నాటుసారా తయారు చేస్తూ గతంలో పట్టుబడిన లావుడ్యా లాలీ అనే మహిళను తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేయగా, బైండోవర్‌ను ఉల్లంఘించి మళ్లీ సారా తయారు చేయడంతో తహసీల్దార్‌ శ్వేత ఆమెకు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్‌ సీఐ విజయ్‌కుమార్‌ తెలిపారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు.

ఎస్‌ఈ వర్సెస్‌ ఉద్యోగులు

- ఇరిగేషన్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వివాదం
- అవుట్‌ సోర్సింగ్‌ డ్రైవర్‌ నుంచి మొదలై ఉద్యోగుల వరకు..
- యూనియన్‌ అధ్యక్షుడికి ఉద్యోగుల ఫిర్యాదు
- గతంలోనే ఎస్‌ఈపై సీఎంకు ఫిర్యాదు చేసిన డ్రైవర్‌

నిజామాబాద్‌నాగారం: తనను అకారణంగా ఉద్యోగంలో నుంచి తొలగించారని, ప్రతి నెలా డబ్బులు తీసుకున్నారని ఆర్మూర్‌ ఇరిగేషన్‌ ఎస్‌ఈపై అవుట్‌ సోర్సింగ్‌ డ్రైవర్‌ ఏకంగా సీఎంకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ వివాదం రోజురోజుకు తీవ్రమవుతోంది. అవుట్‌ సోర్సింగ్‌ ప్రాతిపదికన పని చేస్తున్న డ్రైవర్‌ నుంచి మొదలైన వివాదం ఎస్‌ఈ వర్సెస్‌ ఉద్యోగులు అనే వరకు వచ్చింది. సూపరింటెండెంట్‌ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాగైతే తాము ఉద్యోగాలు చేయలేమని అంటున్నారు. సూపరింటెండెంట్‌ యశస్విని కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఇరిగేషన్‌ యూనియన్‌ అధ్యక్షుడు స్వామికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఈ వ్యవహారశైలిపై శాఖలో జోరుగా చర్చ జరుగుతోంది.

అవుట్‌ సోర్సింగ్‌ ప్రాతిపదికన పనిచేసిన డ్రైవర్‌ సీఎంతోపాటు ఇరిగేషన్‌ మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టాలని నిజామాబాద్‌ సీఈ మధుసూదన్‌ నిజామాబాద్‌ ఎస్‌ఈని ఆదేశించారు. సీఈ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన నిజామాబాద్‌ ఎస్‌ఈ నివేదికను అందజేశారు. అయితే ఉద్యోగులే డ్రైవర్‌ ప్రసాద్‌తో తనపై ఫిర్యాదు చేయించారని ఆర్మూర్‌ ఎస్‌ఈ ఆరోపించడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. దీనిపై వెంటనే టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడి సమక్షంలో విచారణ చేసి న్యాయం చేయాలని ఇరిగేషన్‌ యూనియ్‌ జిల్లా అధ్యక్షుడు స్వామికి విన్నవించారు. ఆర్మూర్‌ ఎస్‌ఈపై అవుట్‌ సోర్సింగ్‌ డ్రైవర్‌ ఫిర్యాదు చేయడంతో అసలేం జరుగుతుందోనని శఖుఖ ఉద్యోగులు జోరుగా చర్చించుకుంటున్నారు. ఆర్మూర్‌ ఎస్‌ఈపై ఉద్యోగులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని ఇరిగేషన్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు స్వామి తెలిపారు. ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులు, టీఎన్జీవోస్‌ జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం



మోపాల్‌ ఎంపీడీవో కార్యాలయం..

- రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసిన యజమాని

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్‌ అభివృద్ధి కార్యాలయానికి (ఎంపీడీవో) భవన యజమాని గంగుబాయి సోమవారం తాళం వేశారు. రెండేళ్లుగా కార్యాలయ అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసినట్లు తెలిసింది. అతి త్వరలోనే అద్దె చెల్లిస్తామనే అధికారుల హామీతో తాళం తీసి కార్యాలయం తెరిచారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది రెండు గంటలపాటు బయట కూర్చోవాల్సి వచ్చింది.

రెండేళ్ల అద్దె చెల్లించాల్సి ఉంది

ఎంపీడీవో కార్యాలయం సుమారు ఆరేళ్ల క్రితం ప్రారంభంకాగా,పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇలా ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఎంపీవో, ఉపాధిహామీ కార్యాలయాలు అదే భవనంలో కొనసాగుతున్నాయి. ప్రతినెలా రూ.12వేలు అద్దె చెల్లించాల్సి ఉండగా, రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదు. ఐదారు నెలలుగా అద్దె చెల్లించాలని కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని యజమాని తెలిపారు.

భిక్కనూరుకు చేరుకున్న గోరక్ష మహాపాదయాత్ర


జంగంపల్లిలో స్వాగతం పలుకుతున్న ఆర్యసమాజ్‌ మందిరం ప్రతినిధులు

భిక్కనూరు: గోరక్ష మహాపాదయాత్ర సోమవారం భిక్కనూ రు మండలానికి చేరుకుంది. మండల కేంద్రంతో పాటు జంగంపల్లి గ్రామంలో యాత్రకు ఘన స్వాగతం లభించింది. శ్రీ దత్త శరణానంద్‌ స్వామిజీ ఆశీస్సులతో హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ మహాపాదయాత్ర నిర్వహిస్తున్నారు. ప్రజలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు ఈ మహాపాదయాత్రను నిర్వహిస్తున్నామని గోరక్షకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించాలని డిమాండ్‌ చేస్తూ ఈ మహాపాదయాత్రను చేపట్టినట్టు బాలకృష్ణ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌, ఆర్యసమాజ్‌ ప్రతినిధులు, శ్రీరామదండు ప్రతినిధులు, అయ్యప్పస్వాములు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యవసాయభూమి సాగు విషయంలో భర్తతో గొడవపడి భార్య, కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలు, భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు, మద్యం మత్తులో మరో యువకుడు ఆత్మహత్య చేసుకోగా, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

భూమి విషయంలో భర్తతో గొడవపడి..

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌):వ్యవసాయ భూమి సాగు విషయంలో భర్తతో గొడవ పడి మండలంలోని న్యాల్‌కల్‌ గ్రామానికి చెందిన పోసాని (55) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పోసాని తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారన్నారు. ఆదేరోజు సాయంత్రం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు చెరువులో పోసాని మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతురాలి కుమార్తె పల్లికొండ స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని రాంపూర్‌గడ్డ తండాకు చెందిన సంపంగి పోశయ్య(60) కడుపు నొప్పి భరించ లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న పోశయ్య ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని లైన్‌గల్లీకి చెందిన షేక్‌ ఇమ్రాన్‌ (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మద్యానికి బానిసైన ఇమ్రాన్‌ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు సరిపోక ఇంట్లో గొడవలు చేసి గత రెండు రోజుల క్రితం భార్యను మాలపల్లి లోని పుట్టింటికి పంపించేశాడు. ఒంటరిగి ఉన్న ఇమ్రాన్‌ మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి..

నవీపేట: మండలంలోని యంచ గోదావరిలో దూకి నిజామాబాద్‌లోని పాటిగల్లీకి చెందిన మాడుగుల సుధాకర్‌(42) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. ఖానాపూర్‌ రైస్‌ మిల్లులో కూలీగా పని చేసే సుధాకర్‌ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెందిన సుధాకర్‌ ఆదివారం గోదావరిలో దూకి గల్లంతయ్యాడన్నారు. సోమవారం మృతదేహం లభించిందని ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

దోమకొండ: భార్య కాపురానికి రావడంలేదని మండల కేంద్రానికి చెందిన బొయిని రాకేశ్‌(26) అనే యువకుడు ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాకేశ్‌కు ఆరు నెలల క్రితం వివాహం కాగా, నాటి నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాకేశ్‌ ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వ్యవసాయబావి వద్ద రాకేశ్‌ చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో అతడి స్నేహితుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై యాదగిరిగౌడ్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కంజర్‌ శివారులో బైక్‌ అదుపుతప్పి దూస్‌గాం గ్రామానికి చెందిన ఇందూర్‌ రాములు (47) మృతి చెందాడు. సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయం చేసుకుంటూ జీవితంచే రాములు వ్యక్తిగత పని నిమిత్తం ఉదయం జిల్లా కేంద్రానికి వచ్చి మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో దూస్‌గాంకు తిరుగు ప్రయాణమయ్యాడు. కంజర్‌ - కులాస్‌పూర్‌ గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడిపోగా, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సువర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యభిచారం గృహంపై సీసీఎస్‌ పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగర శివారులోని పాంగ్రా ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం కొనసాగుతోందనే సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారన్నారు. ముగ్గురు మహిళలతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

గోదాంలో చోరీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఫరూక్‌ అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రిసిటీ సామగ్రి గోదాములో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. దుండగులు గోదాం తలుపులను పగులగొట్టి రూ.50వేల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత..

బాల్కొండ: మినీ గూడ్స్‌ వాహనంలో తరలిస్తున్న 37.2 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని సోమవారం ఎస్సై నరేశ్‌ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్‌ రిజ్వాన్‌ఖాన్‌, అబ్దుల్‌ ఖలీల్‌ పీడీఎస్‌ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో మేరకు వాహనాన్ని వెంబడించి పాతబస్టాండ్‌ ప్రాంతంలో పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌ గ్రామానికి బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. ఆదివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారని ఆచూకీ లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. బాలిక ప్రస్తుతం రెంజల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోందని తెలిపారు. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆకతాయిలకు రెండు రోజుల జైలు శిక్ష

బోధన్‌టౌన్‌(బోధన్‌) : బోధన్‌ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఈవిటీజింగ్‌కు పాల్పడిన ఇద్దరు ఆకతాయిలకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేషతల్పసాయి తీర్పు ఇచ్చినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో షీటీం పోలీసులు ఇద్దరు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించారన్నారు. యువకులను సోమవారం బోధన్‌ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షను విధించారని తెలిపారు.

కమ్యూనిటీ సర్వీస్‌ చేయాలని న్యాయమూర్తి తీర్పు

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులకు కమ్యూనిటీ సర్వీస్‌ చేయాలని సెకండ్‌ క్లాస్‌ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా కమ్యూనిటీ సర్వీస్‌ చేయాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: కోటగిరి మండలం రాంపూర్‌లో ఆదివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి సీజ్‌ చేసి సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు.

174 సైబర్‌ క్రైం కేసుల పరిష్కారం

- లోక్‌ అదాలత్‌లో జిల్లా పోలీసుశాఖకు రాష్ట్రంలో ఐదో స్థానం
- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ వెల్లడి


సింధుశర్మ

ఖలీల్‌వాడి: జాతీయ లోక్‌ అదాలత్‌ ద్వారా నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలోని సైబర్‌ క్రైం పోలీస్‌ స్టేషన్‌లో నమోదైన 174 కేసులను పరిష్కరించినట్లు ఇన్‌చార్జి సింధు శర్మ సోమవారం తెలిపారు. మొత్తం 174 కేసుల్లో రూ.71,52,505 నగదును బాధితులకు ఇప్పించామన్నారు. జాతీయ లోక్‌ అదాలత్‌ ద్వారా సైబర్‌ క్రైమ్‌ పరిధిలోని కేసుల పరిష్కారంలో నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో హోల్డ్‌లో ఉన్న డబ్బులను, జాతీయ లోక్‌ అదాలత్‌ ద్వారా ఫిర్యాదుదారులకు ఇప్పించేందుకు ఉత్తర్వులను జారీ చేశామన్నారు. రూ.25 వేల కన్నా ఎక్కువ నష్టపోయిన 131 కేసుల్లో రూ.6,70,022 అలాగే 25 వేల కన్నా తక్కువ నష్టపోయిన 43 కేసుల్లో రూ.4,52,284 నగదు ఉందన్నారు. సైబర్‌ మోసగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. లోన్‌ యాప్‌లకు దూరంగా ఉండాలని, కస్టమర్‌ కేర్‌ నంబర్లను గుగూల్‌ లో వెతకొద్దని, ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్‌ నుంచి మాత్రమే కస్టమర్‌ కేర్‌ నంబర్లను పొందాలన్నారు. అపరిచిత నంబర్ల నుంచి ఫేస్‌బుక్‌, వాట్సాప్‌ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించొద్దన్నారు. సైబర్‌ నేరగాళ్లబారిన పడిన వారు వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.9లక్షల విరాళం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం వేంపల్లి గ్రామంలో శివాలయ పునర్నిర్మాణం కోసం బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌ రూ.9లక్షలు విరాళంగా అందించారు. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న దాత

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె


మద్దతు తెలుపుతున్న ధర్మ టీచర్స్‌ యూనియన్‌ నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో నిరసన తెలిపిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ధర్మ టీచర్స్‌ యూనియన్‌ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ధర్మ టీచర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌ అన్నారు. కార్యక్రమంలో డీటీయూ నాయకులు రాజు, సంతోష్‌, భాగేంద్ర, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు .



అపూర్వ సమ్మేళనం

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆలూర్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 25 సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముక్కెర విజయ్‌, నడిసరం మల్లయ్య, గంజి రామకృష్ణ, వుజ్జ రాకేశ్‌, నారాయణ, చిరంజీవి, గోపి నరేందర్‌, గంగారెడ్డి, మమత, శ్రీలత, రేణుక, వనిత, సుమలత, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు అవకాశాలు కల్పించాలి



బిచ్కుంద(జుక్కల్‌): అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాల్‌రాజ్‌ అన్నారు. సోమవారం బిచ్కుందలో పార్టీలకు అతీతంగా నియోజకవర్గ మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాల్‌రాజ్‌తోపాటు జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌ పాల్గొన్నారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి బండాయప్ప ఫంక్షన్‌ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాసుల మాట్లాడుతూ.. మున్నూరుకాపులు వ్యవసాయమే జీవనాధారం జీవిస్తున్నారని అన్నారు. మున్నూరుకాపు ప్రత్యేక కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి యువకులకు రుణాలు ఇవ్వాలి.. రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు.

మాయమాటలు చెప్పి నగదు అపహరణ


సీసీ ఫుటేజీలో నిందితుడు

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలోని యూనియన్‌ బ్యాంకులో వృద్ధుడికి ఓ వ్యక్తి మాయమాటలు నగదును అపహరించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బాద్గుణ గ్రామానికి చెందిన తన్నూరి నాగన్న అనే వృద్ధుడు యూనియన్‌ బ్యాంకుకు వచ్చి తన ఖాతా నుంచి రూ.26 వేలు డ్రా చేసుకునేందుకు సిబ్బందితో చెక్కు రాయించుకుని కౌంటర్‌లో ఇచ్చారు. బ్యాంకు అధికారులు పిలుస్తారని వేచి చూస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి నాగన్నతో మాటలు కలిపాడు. తనకు క్యాషియర్‌ తెలుసునని, డబ్బులు త్వరగా డ్రా చేసి ఇస్తానని నీవు కూర్చోమని నమ్మబలికాడు. బ్యాంకు అధికారి నాగన్న పేరు పిలవగానే సదరు వ్యక్తి వెళ్లి దూరంగా కూర్చున్న నాగన్న చూపించి డబ్బులు తీసుకున్నాడు. ఈ విషయం తెలియని నాగన్న వద్దకు వెళ్లిన వ్యక్తి క్యాషియర్‌కు చెప్పానని వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించి తనకు ఫోన్‌ వచ్చిందని ఉడాయించాడు. నాగన్న క్యాష్‌కౌంటర్‌ వద్దకు వెళ్లి డబ్బులు అడుగగా ఇదివరకే నీవు చెప్పిన వ్యక్తికి ఇచ్చామని చెప్పడంతో నాగన్న మోసపోయానని తెలిసి లబోదిబోమన్నాడు.

గంటన్నర సేపు బ్యాంకులోనే మకాం

నగదుతో ఉడాయించిన వ్యక్తి మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు వరకు బ్యాంకులోనే తిష్ట వేసి అవకాశం కోసం వేచి చూశాడు. బ్యాంకులోకి వచ్చిన వారితో మాటలు కలుపుతూ చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. చివరికి బాద్గుణ గ్రామానికి చెందిన తన్నూరి నాగన్న అనే వృద్ధుడిని నమ్మబలికి రూ.26 వేలతో ఉడాయించాడు. ఈ విషయమై బాధితుడు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి గాలిస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

11 తులాల బంగారం అపహరణ

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ముబారక్‌నగర్‌ ప్రాంతంలోని ఏకశిలనగర్‌లో నివాసం ఉంటున్న రవి, మహేశ్‌ అనే వ్యక్తుల ఇళ్లలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి 11 తులాల బంగారం, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరిఫ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రవి, మహేశ్‌ ఈనెల 13న వారి స్వగ్రామమైన మాక్లూర్‌ మండల కేంద్రానికి శుభకార్యం నిమిత్తం తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. దుండగులు 14వ తేదీన అర్ధరాత్రి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం వచ్చిన రవి, మహేశ్‌ తమ ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ముబారక్‌నగర్‌లో గత పదిరోజుల క్రితం ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటనను మరువకముందే రెండు ఇళ్లలో చోరీ జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.